
# ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

## సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

## కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.



### విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవితకాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్లపైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతోపాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

### అస్మదీయుల కోసమేనా?


బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతోపాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఐదింతలైన ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

## ఎన్‌ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్‌ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.



## ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

### క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ. 1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

## నష్టాల్లో మార్కెట్లు


ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడంతోపాటు ఎఫ్‌ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.




## అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

# కొత్త బాస్.. కోతకు సై!





### నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం

### నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు

### రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం

ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. మున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

### ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

### ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

## జొమాటో ఇకపై ఎటర్నల్

### పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

## టీసీఎస్ ఉద్యోగులకు షాక్

### సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినిప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత్త పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరు తో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

## జీరో ఎఫ్‌ఐఆర్‌పై పోలీసుల విచారణ

- మరిపెడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ
- హర్యానా రాష్ట్రంలో చోటుచేసుకున్న సంఘటన
- మరిపెడకు సంబంధం ఉన్నట్లు సమాచారం

మరిపెడ, ఫిబ్రవరి6: హర్యానా రాష్ట్రంలో పల్వల్‌కు చెందిన ఓ వివాహితను ఆమె భర్త, మరో ఇద్దరు కలిసి లైంగిక దాడి చేశారని, వారిపై బుధవారం అక్కడ జీరో ఎఫ్‌ఐఆర్ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు సంబంధం ఉన్నట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్‌ఐఆర్ కేసును ఇక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ భర్త, మరో ఇద్దరు కలిసి బాధితురాలిని బతుకుదెరువు కోసమంటూ హైదరాబాద్‌కు తీసుకొచ్చి మత్తుమందు కలిపిన శీతలపానీయం తాగించి 40 రోజుల పాటు లైంగిక దాడి చేసినట్లు తెలిపారు. మహిళ ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తూ చిత్రహింసలకు గురి చేశారన్నారు. నిందితుల నుంచి బాధితురాలు తప్పించుకు వెళ్లి పల్వల్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టడంతో వారు మరిపెడకు సంబంధం ఉన్న నేపథ్యంలో జీరో ఎఫ్‌ఐఆర్‌ను బదిలీ చేశారని, ఈ కేసును విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## వ్యసనాలకు అలవాటుపడొద్దు


నెల్లికుదురు, ఫిబ్రవరి 6 : విద్యార్థులు వ్యసనాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై చిర్ర రమేశ్‌బాబు విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఉన్నతస్థానాల్లో ఉన్నవారిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్..

నర్సింహులపేట, ఫిబ్రవరి 6 : కౌసల్యాదేవిపల్లి ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా వేసినట్లు తెలిపారు.

## గుడుంబా కేసులో ఐదుగురికి రిమాండ్

తొర్రూరు, ఫిబ్రవరి 6 : గుడుంబా విక్రయిస్తున్న ఐదుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ ఏఈఎస్ ప్రవీణ్ తెలిపారు. ఆది వెంకటమ్మ (తొర్రూరు), ఎండీ ఇమాన్ బీ(మదనతుర్తి, నెల్లికుదురు మండలం), శ్రీరామ్ ఉమ, పెరుమాండ్ల చంద్రకళ (రాజుల కొత్తపల్లి), పెరుమాండ్ల సుజాత గుడుంబా విక్రయిస్తూ పట్టుబగా నర్సంపేట జైలుకు తరలించారు. గురువారం ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి ఆధ్వర్యంలో నెల్లికుదురు తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టి, రిమాండ్‌కు తరలించారు.



ఆలేరులో డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్


## పంట వివరాలు నమోదు చేయాలి

నెల్లికుదురు, ఫిబ్రవరి 6 : యాసంగి పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆలేరు క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. యాసంగికి పంటల వివరాలను నిర్దేశిత సమయంలో ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్‌కే యాస్మిన్, ఏఈవో మణికంఠ పాల్గొన్నారు.

# తూకంలో దగా.. నగదు చెల్లింపులో కోత



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి,



తక్ పట్టీపై రూ.874 తగ్గించిన వ్యాపారులు


- ఇప్పటికే తగ్గిన మిర్చి దిగుబడి.. మద్దతు ధర
- తూకంలో గ్రాములను పరిగణనలోకి తీసుకోని వ్యాపారులు
- కిలోల కొద్దీ పంట నష్టపోతున్న అన్నదాతలు
- నగదు చెల్లింపుల్లోనూ తగ్గించి ఇస్తున్న వైనం..
- అడిగితే పది రోజుల వాయిదాతో చెక్కులు..
- నిండా మోసపోతున్న మిర్చి రైతులు
- పట్టించుకోని మార్కెట్ అధికారులు

కేసముద్రం, ఫిబ్రవరి 6 : 'కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవి'లా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి. నకిలీ విత్తనాలు, వాతావరణం అనుకూలించకపోవడం, గుబ్బ, నల్లి తదితర రోగాలు సోకడంతో మిర్చి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అప్పులు తెచ్చి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడంతో పలువురు రైతులు పంటను తొలగించారు. దీనికితోడు చేతికి వచ్చిన పంటను అమ్ముకునే సమయంలోనూ మార్కెట్‌లో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఈసారి మహబూబాబాద్ జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. గత ఏడాది 72 వేల ఎకరాల్లో సాగు చేయగా, ప్రస్తుతం 48 వేల ఎకరాల్లోనే పంట వేశారు. గతేడాది ఇదే నెలలో క్వింటా మిర్చి ధర రూ. 23 వేలుండగా, ఈసారి రూ. 13,800 పలుకుతున్నది. సాగు విస్తీర్ణం తగ్గిపోవడం, దిగుబడి రాకపోవడంతో పాటు మార్కెట్‌లో సరైన ధర రాకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కేసముద్రం మార్కెట్‌లో ఈ నామ్ ప్రకారం సరుకును కొనుగోలు చేసిన వ్యాపారులు నేరుగా రైతుల ఖాతాల్లో నగదును జమ చేయాలి లేదా సరుకు అమ్మిన తేదీతో చెక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా వ్యాపారులు నగదు చెల్లిస్తూ కమీషన్ పేరిట 2 శాతం కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారు. మిర్చి కొనుగోళ్లలో వందకు రూ. 2 చొప్పున లక్షకు రూ.2 వేలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. నగదులో కోతపై ప్రశ్నించిన రైతులకు 10 రోజుల వాయిదాతో చెక్కు ఇస్తున్నారు.

**తూకంలోనూ మోసం..**

మక్కజొన్న, పత్తి, ధాన్యం ఉత్పత్తులకు కేజీకి రూ.10-20 మధ్య ధర ఉండడంతో గ్రాముల్లో తూకాన్ని పరిగణనలోకి తీసుకోరు. దీనివల్ల రైతులకు కూడా పెద్దగా నష్టం ఉండదు. అయితే మిర్చికి కేజీకి రూ. వందల్లో ధర పలుకుతుండడంతో గ్రాముల్లో తూకాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంతో రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తున్నది. ఉదాహరణకు ఒక మిర్చి బస్తా 39.400 కిలోల బరువుంటే ఎక్కువగా ఉన్న 400 గ్రాములను పట్టించుకోవడం లేదు. కేవలం 39 కేజీలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. మరో బస్తా 40.900 కేజీలుంటే 40.500 కేజీలను లెక్కించి 400 గ్రాములను వదిలి పెడుతున్నారు. ఇలా ఒక్కో రైతు పెద్ద ఎత్తున మిర్చి పంటను నష్టపోతున్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ మార్కెట్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు కేసముద్రం మార్కెట్‌కు 11 వేల బస్తాల మిర్చి విక్రయానికి వచ్చింది. గురువారం మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర గరిష్ఠంగా రూ.13,739, కనిష్ఠంగా రూ. 6,212 పలికింది.

### వైరస్‌తో పంట తీసేసిన..



నాకున్న 35 గుంటల భూమిలో మిర్చి పంట వేసిన. పంటకు నల్లి తెగులు సోకడంతో చాలాసార్లు మందులు పిచికారీ చేసిన. పంట కోసం సుమారు రూ. 65 వేలు పెట్టుబడి పెట్టిన. అయినప్పటికీ పంట కోలుకోకపోవడంతో కాయలను కోసి పంట తొలగించిన. చేతికి వచ్చిన మిర్చిని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే క్వింటాకు రూ. 12,699 పలికింది. మొత్తం పంట 3 క్వింటాళ్ల 40 కేజీల బరువొచ్చింది. దాదాపు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా వైరస్‌తో తగ్గిపోయింది. ధర కలిసి వస్తుందనుకుంటే అదికూడా పూర్తిగా తగ్గిపోయింది. వ్యాపారులు కమీషన్ పేరుతో కోత విధిస్తున్నారు. నాకు రూ. 43,541 ఇవ్వాల్సి ఉండగా రూ. 874 తక్కువ చేసి రూ. 42,667 ఇచ్చారు.

*- బానోత్ శంకర్, నెల్లికుదురు, మహబూబాబాద్ జిల్లా*

# పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష


మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయించాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ నెల 10న ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, విద్యార్థులకు మధ్యాహ్నం 12గంటలకు మాత్రలు వేసి, రెండు గంటల పాటుగా వారిని అబ్జర్వేషన్‌లో ఉంచాలన్నారు.

### నులి పురుగుల దినోత్సవంపై అవగాహన


తొర్రూరు, ఫిబ్రవరి 6 : జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా తొర్రూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 17న మాప్-అప్ రౌండ్ ద్వారా రెండో అవకాశంగా మాత్రలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

### పిల్లలకు మాత్రలు వేయాలి..

నెల్లికుదురు : గ్రామాల్లోని పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని వేయాలని తహసీల్దార్ కోడిచింత రాజు, ఎంపీడీవో బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ శారద అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 10న డీ వార్మింగ్ డేను జయప్రదం చేయాలన్నారు. డాక్టర్ రమ్య, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరు : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్



నెల్లికుదురు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

### చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : 19యేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండాఅల్బెండజోల్ మాత్రలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నులి పురుగుల నివారణ కోసం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో రామారావు, ఎంఈవో రవికుమార్, వైద్య సిబ్బంది వలిఉద్దీన్ తదితరులు ఉన్నారు.

### నులిపురుగులపై అవగాహన సదస్సు


మరిపెడ : నులి పురుగు నిర్మూలనపై మండలస్థాయి అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ.. మరిపెడ మండల పరిధిలో 19 సంవత్సరాలలోపు వయసు ఉన్న20,893 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం 10న ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణమూర్తి, ఎంపీడీవో కనకదుర్గ, ఎంఈవో అనితాదేవి, ఎంపీవో సోమ్లాల్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృష్ణ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.



చిన్నగూడూరు : మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

## ప్రాణాల మీదికి తెచ్చిన సెల్‌ఫోన్

### కింద పడిన ఫోన్ కోసం రైలు నుంచి దూకిన యువకుడు



అరవింద్

కేసముద్రం, ఫిబ్రవరి 6: సెల్‌ఫోన్ వినియోగం ఆ యువకుడి ప్రాణాల మీదికి తీసుకొచ్చింది. కింద పడిన ఫోన్ కోసం ప్రయాణిస్తున్న రైలు నుంచి దూకడంతో బీ ఫార్మసీ విద్యార్థి తన రెండు కాళ్లు కోల్పోగా, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన కోగిల అరవింద్ ఖమ్మంలో బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇంటికి వెళ్లేందుకు విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులో ఖమ్మం నుంచి వరంగల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నే రైల్వే స్టేషన్ల మధ్య గురువారం రైలులోని డోర్ వద్ద నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా కింద పడిపోయింది. ఫోన్ కోసం వెంటనే అరవింద్ రైలు నుంచి కిందకు దూకాడు. దీంతో అరవింద్ రెండు కాళ్లు పూర్తిగా విరుగగా, చేతికి గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, అక్కడ నుంచి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు. ఒక్క కాలు మోకాలు పైభాగం వరకు, మరో కాలు పాదం తొలగించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు.